ప్రజాశక్తి
మంగళవారం 12 డిసెంబర్ 2023
8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

జివిఎంసి కౌన్సిల్ రసాభాస

◆ టిడిఆర్‌లపై రగడ ◆ వీధి దీపాలు వెలగకపోవడంపైనా తీవ్ర చర్చ
◆ ప్రతిపక్షాల నిరసనల మధ్య 51 అంశాలు ఆమోదం, 2 అంశాలు వాయిదా

ఒకరినొకరు నెట్టుకుంటున్న వైసిపి, టిడిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

తీవ్ర నిరసనలు, రసాభాస మధ్య జివిఎంసి కౌన్సిల్ సమావేశం సోమవారం సాగింది. కొట్లాటల నుంచి తన్నులాట వరకూ ఓ దశలో వెళ్లింది. ఈ పరిస్థితుల నడుమనే సమావేశంలో ప్రధాన అజెండాలోని 18, అనుబంధ అజెండాలోని 27, టేబుల్ అజెండాలోని 8 అంశాలు.. వెరసి 53 అంశాలపై చర్చ జరిగింది. అనుబంధ అజెండాలోని 13, 14 అంశాలను వాయిదా వేసి మిగిలిన 51 అంశాలను మేయర్ ఏకపక్షంగా ఆమోదించారు. అంతేగాకుండా ప్రతి సభ్యునికీ జీరో అవర్‌లో అవకాశం కల్పించి వారి సమస్యలను కౌన్సిల్‌కు వివరించే అవకాశం కల్పించారు.

సమావేశంలో ప్రధానంగా దసపల్లా భూములకు సంబంధించి 100 అడుగుల రోడ్లు నిర్మించేందుకు టిడిఆర్ అనధికారికంగా ఇస్తున్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, టిడిపి కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పీలా శ్రీనివాసరావులు మేయర్ పోడియం వద్ద నిరసన తెలియజేస్తున్న సమయంలో మేయర్ వారికి మాట్లాడేందుకు నిరాకరించారు. అంతటితో ఆగక అంశాలను ఏకధాటిగా ఆమోదిస్తున్నందున పోడియం వద్ద టిడిపి కార్పొరేటర్లు నిరసనకు దిగారు. వారిని వారించేందుకు వచ్చిన వైసిపి కార్పొరేటర్లు ఒకరినొకరు నెట్టుకున్నారు. ఈ క్రమంలో వైసిపి కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ టిడిపి కార్పొరేటర్లను తోసి వేయడంతో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ కొట్లాట కారణంగా సభను 20 నిమిషాలు వాయిదా వేసి మిగతా 2లో..

సమస్యలపై గళం విప్పిన సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

సమస్యలపై ప్రశ్నిస్తున్న డాక్టర్ బి.గంగారావు

జివిఎంసిలో పరిధిలో ఇప్పటివరకు ఇచ్చిన టిడిఆర్‌లను పరిశీలించాలని తాము కౌన్సిల్‌ను కోరామని, దానిపై కొంత సమాచారం మాత్రమే ఇచ్చారని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. గత కౌన్సిల్ సమావేశంలో వాటర్ వర్క్స్ విభాగంలో సెమీస్కిల్డ్ లేబర్‌కు సంబంధించిన అంశాన్ని అజెండాగా చేర్చాలని కోరామని, వచ్చే కౌన్సిల్ సమావేశంలోనైనా దాన్ని అంశంగా చేర్చి వారి సమస్యలు తీర్చాలని కోరారు. కాంట్రాక్టు వర్కర్లకు ప్రొఫెషనల్ మిగతా 2లో..

లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి, జనసేన కార్యకర్తలు

అనకాపల్లిలోకి యువగళం

లోకేష్ బృందానికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పాయకరావుపేట : ఉత్తరాంధ్రలోకి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర అడుగుపెట్టింది. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోకి సోమవారం రాత్రి 7 గంటలకు ప్రవేశించింది. టిడిపి మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, బోడపాటి శివదత్త, అంగుళూరు శివలక్ష్మి కుమారిల ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు తరలివచ్చి లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. పాయకరావుపేట పట్టణంలోని వై జంక్షన్ వద్దనున్న ఎన్‌టి రామారావు విగ్రహానికి పూలమాల వేసి లోకేష్ ఘన నివాళ్లర్పించారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా పిఎల్.పురం, సీతారాంపురం, నామవరంల్లో యాత్ర సాగింది. ఎక్కడికక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. లోకేష్ రాత్రికి నామవరంలో బస చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, వెలగపూడి రామకృష్ణబాబు, పప్పల చలపతిరావు, తదితరులు ఉన్నారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

▶ వార్త 2లో..

అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు మద్దతు

▶ వార్త 2లో..

తుపాను పరిహారానికి రోడ్డెక్కిన అన్నదాతలు

▶ వార్త 5లో..

బిఎస్ఎన్ఎల్ ఆస్తులను డిఒటికి కట్టబెట్టొద్దు

నిరసన తెలుపుతున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్ భూములను, భవనాలను డిఒటికి కట్టబెట్టవద్దు అంటూ సోమవారం డాబాగార్డెన్స్‌లోని పిజి ఎంటిడి కార్యాలయం ఎదుట బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎయుఎబి జిల్లా కన్వీనర్ పిఇ సిహెచ్‌వి సాగర్ మాట్లాడుతూ ఘజియాబాద్‌లో ఉన్న బిఎస్ఎన్ఎల్‌కు చెందిన 80 ఎకరాల భూములను దాని చుట్టూ ఉన్న కాంపౌండ్‌తో సహా డిఒటికి అప్పగించారని చెప్పారు. అలాగే బిఎస్ఎన్ఎల్ కార్యాలయ భవనాన్ని కూడా డిఒటి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రెసిడెన్షియల్ ఉత్తర్వులను ఖండించారు. డిఒటికి భూములు ఇవ్వడాన్ని మరొకసారి పరిశీలించాలని బిఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారి ఒకరు అభ్యంతరం చెప్పగా, ఆయనను హుటాహుటిన జమ్మూ కాశ్మీర్‌కు బదిలీ చేశారని తెలిపారు.

దీనిని బట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునన్నారు. బిఎస్ఎన్ఎల్‌కు 4జి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎగ్జిక్యూటివ్స్, నాన్ ఎగ్జిక్యూటివ్స్, యూనియన్ నాయకులు చక్రవర్తి, సతీష్, రామాంజనేయులు, సత్యప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ చుట్టూ అసమ్మతి ఉచ్చు !

◆ విశాఖలో పలు చోట్ల గ్రూపుల బెడద ◆ పలువురి నేతల్లో 'సర్వే'ల ఆందోళన
◆ దక్షిణం, గాజువాక సెగ్మెంట్లలో వైసిపికి తప్పని అగచాట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో అధికార వైసిపిపై అసమ్మతివాదులు ఉచ్చు బిగిస్తున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్కొక్కటిగా ఇది బయటపడుతోంది. స్థానికంగా పలువురు నాయకులను వైసిపి ఆంతరంగిక విషయాలు, పాలనా వ్యవహారాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. మరీ ముఖ్యంగా తెలంగాణ ఎన్నికల తర్వాత ఆంధ్రాలో రాజకీయ పరిస్థితులపై అంతటా చర్చ జరగడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్నట్టుగానే సిట్టింగులపై అసంతృప్తులు ఇక్కడా కనిపిస్తున్నాయి. వారే 2024లో నిలబడితే ఓట్లు, సీట్లు రావనే ఆందోళన కొంతమంది సీనియర్ కార్యకర్తలు, పార్టీనే నమ్ముకున్న వారి నుంచి వినిపిస్తున్న మాట. దిగువ శ్రేణుల్లో 2019 ఎన్నికల తర్వాత నుంచీ ఈ అసంతృప్తులు వెన్నంటే ఉన్నాయి. అయినప్పటికీ అధినాయకత్వం నివారించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఎవరి గోల వారిదే అన్నట్టుగా మంత్రులు, ఎమ్మెల్యేల వ్యవహారం ఉండడంతో ప్రధాన అనుచరులు, నాయకుల్లో అసమ్మతి పెల్లుబుకుతోంది.

దేవన్ రెడ్డి (ఫైల్‌ఫొటో)

అంతటా అదే వరస

విశాఖ నగరంలోని తూర్పు, దక్షిణం, పశ్చిమం, ఉత్తరం సహా గాజువాక వంటి ప్రధాన అసెంబ్లీ సెగ్మెంట్లలో గ్రూపుల బెడదతో అధికార వైసిపి సతమతమవుతోంది. పలు సర్వేలు కూడా ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను కంగారు పెడుతున్నాయి. గాజువాకలో ఎమ్మెల్యే నాగిరెడ్డి తనయుడు దేవన్‌రెడ్డి ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి సోమవారం రాజీనామా చేయడం ఈ కోవలోకే వస్తుంది. ఫలానా సామాజిక తరగతి వారికి ఫలానా నియోజకవర్గంలో సీటు ఇస్తేనే గెలుపు గుర్రాలను అందుకోగలరన్న సర్వే నివేదికలతో పలువురు కలవరపాటుకు గురవు తున్నారు. తాజాగా గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉరుకూటి చందును అధిష్టానం ఖాయం చేసినట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా విశాఖలో కొత్తగా ఆ పార్టీలోకి వచ్చే వారి కంటే బయటకు పోయే వారి సంఖ్య నానాటికీ అంటే ఎన్నికలు సమీపిస్తున్నప్పటికి పెరగనుందన్నది తెలుస్తోంది. దక్షిణం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అధికార పార్టీ చుట్టూ అసమ్మతి ఉచ్చు !

అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ ఇదే గ్రూపుల బెడద వైసిపిలో ఉంది. ఇండిపెండెంట్లుగా గెలిచి వైసిపి తీర్థం పుచ్చుకున్న వారంతా ఎన్నికల ముందు ఆ పార్టీకి ఝలక్ ఇచ్చి జనసేన లేదా ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ప్రధానంగా స్థానిక శాసన సభ్యులు వాసుపల్లి గణేష్‌కుమార్ పట్ల వ్యతిరేకత నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికలు దగ్గర పడడంతో ఏదో ఒక పేరుతో డబ్బు పంచే ఏర్పాట్లలో ఎమ్మెల్యే వాసుపల్లి నిమగ్నం కావడం చూస్తే ప్రతిపక్షానికి ఇది ఒక ఆయుధం కానుంది. ఇక్కడ గతంలో కందుల నాగరాజు వైసిపిలోకి వచ్చినట్టే వచ్చి జనసేనలోకి దూరారు. తాజాగా సాధిక్ ఉన్నట్టుండి వైసిపికి రాజీనామా చేశారు. స్థానిక ఎమ్మెల్యేపై అసంతృప్తి ఒక్కటే కాకుండా తమ రాజకీయ భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని పలువురు రాజీనామాలకు దిగుతున్నారు. తూర్పు, ఉత్తరం, దక్షిణంలో కూడా త్వరలో ఇవే దృశ్యాలు బయటపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

హై కమాండ్ ఏం చేస్తోంది ?

తెలంగాణలో ఏం జరిగిందో ఇక్కడా అదే పునరావృతమవుతుందా ? అన్నది వైసిపి సీనియర్ నాయకుల నుంచి వినిపిస్తోంది. అక్కడెలాగైతే ఎమ్మెల్యేలు, మాజీ సిఎం కెసిఆర్‌పై ప్రజానీకంలో గూడుకట్టుకున్న అసంతృప్తిని పసిగట్టడంలో విఫలం అయ్యారో ఎపిలోని మెజారిటీ సెగ్మెంట్లలోనూ అదే పరిస్థితి ఉందంటూ పలువురు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అందరూ సర్దుకోవడం కనిపిస్తోంది. ఐపాక్ సర్వే, పికె సర్వేలు ఇతరత్రా పలు పీపుల్స్ పల్స్ సర్వేల నేపథ్యంలో అధికార పార్టీకి పలువురు దూరం అవుతున్నట్లు స్పష్టమవుతోంది.

దేవన్ రెడ్డి ఇంటికి కోలా గురువులు

గాజువాక : తిప్పల దేవన్ రెడ్డి రాజీనామాతో, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు సోమవారం రాత్రి దేవన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఏకాంతంగా ఇరువురూ చర్చించుకున్నారు. పార్టీ నిర్ణయం తప్పదని కోలా గురువులు చెప్పినట్లు ప్రచారం సాగుతోంది. ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని దేవన్ రెడ్డి పట్టుబట్టినట్టు కార్యకర్తల ద్వారా తెలిసింది.

జివిఎంసి కౌన్సిల్ రసాభాస

తిరిగి ప్రారంభించారు. అనంతరం మిగిలిన అంశాలను చర్చ లేకుండానే ఆమోదించారు.

సమావేశం సాగిందిలా..

సభ ప్రారంభమైన వెంటనే జనసేన కార్పొరేటర్లు తమ నాయకులను నగరంలో అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ మేయర్ పోడియం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం మేయర్ జీరో అవర్‌ను ప్రవేశపెట్టారు. మొదటగా మాట్లాడిన విల్లూరి భాస్కరరావు పూర్ణా మార్కెట్ ప్రాంతంలో అక్రమ ఆశీళ్ల వసూలు చేస్తున్నారని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడిన 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తన వార్డులో మూడు నెలలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని, దీనిపై మేయర్ వివరణ ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా 2021 నాలుగో నెలలో శంకుస్థాపన చేసిన కల్యాణ మండపం ఇప్పటిదాకా పూర్తి కాలేదని తెలిపారు. ప్రత్యేక వార్డుకు ఒక కోటి యాభై లక్షలు ఇస్తామని చెప్పిన జివిఎంసి కౌన్సిల్ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. జగదాంబ నుంచి వన్‌టౌన్‌కి వెళ్లే మార్గంలో టిడిఆర్‌లు ఇవ్వకుండా పనులు చేపట్టారని తెలిపారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు తమ ప్రాంతంలో వీధిలైట్లు వెలగడం లేదని మేయర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ కాకి గోవింద్ తమ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. 56వ వార్డు వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మూడు నెలలుగా అందుబాటులో లేరని, మందులు కూడా లేవని టిడిపి కార్పొరేటర్ రాజశేఖర్ మేయర్‌కు ఫిర్యాదు చేశారు. 36వ వార్డులోని కొండవాలు ప్రాంతంలో రోడ్లు, మెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆ వార్డు కార్పొరేటర్ తెలిపారు. 72వ వార్డులో మూడు నెలల క్రితం శంకుస్థాపన చేసిన బస్ షెల్టర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్ మేయర్‌ను అభ్యర్థించారు.

జీరో అవర్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మేయర్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు ఎన్‌ఫోర్సుమెంట్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని జివిఎంసి కమిషనర్‌ను ఆదేశించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ బ్రిడ్జి అండ్ రూఫ్ కంపెనీకి నగరంలోని 1,20,000 లైట్లు మెయింటినెన్స్ ఇచ్చామని, వారు సిసిఎంఎస్ ట్రాకింగ్ ద్వారా పనితీరును జివిఎంసికి తెలియజేయాలని, కానీ నగరంలో ఇప్పటివరకు 50 వేల లైట్లను మాత్రమే సిసిఎంఎస్‌కు కనెక్ట్ చేశారని తెలిపారు. గుత్తేదారుకు ఇప్పటికే నోటీసు ఇచ్చామని, ఈ నెలాఖరులోపు మరొకసారి నోటీస్ ఇచ్చి, అప్పటికీ స్పందించకపోతే కౌన్సిల్ ఆమోదంతో వారి కాంట్రాక్టును రద్దు చేస్తామని అన్నారు.

సమస్యలపై గళం విప్పిన సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ట్యాక్స్ వసూలు చేయరాదని జివిఎంసి కౌన్సిల్ నుంచి కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చినప్పటికీ వారు వసూలు చేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంవిపి.కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలో ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని, స్విమ్మింగ్‌కు రూ.4 వేలు నుండి రూ.5 వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా టేబుల్ టెన్నిస్‌కు రూ.5 వేలు తీసుకుంటున్నారన్నారు. కాలేజీ విద్యార్థుల నుంచి సైతం రూ.750 వసూలు చేస్తున్నారని ఆయన కౌన్సిల్‌కు తెలిపారు దీనిపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. 72, 73వ వార్డుల మధ్యలో ఉన్న రజకుల దోబీఖానా ప్రాంతంలో పార్కు నిర్మాణం చేపట్టారని, తద్వారా అక్కడ ఉండే రజకులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దీనిని వెనక్కి తీసుకొని అక్కడ వారికి దోబీఖానా నిర్మించాలని ఆయన కోరారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను జిల్లాలో వున్న వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సోమవారం అల్లూరి సీతారామరాజు భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలోత్సవం పిల్లల కోసం జరుగుతున్న పెద్ద పిల్లల పండగ అని, దాని కోసం సమాజంలో ఉన్న వారంతా సహకరించాలని కోరారు. పిల్లలకు బాల్యంలో ఇటువంటివి నిర్వహించడం ద్వారా వారిలో అనేక అంశాలలో నిపుణత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ సి.సునీత, కన్సర్న్ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పి.కె.జోస్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ బిమ్మి బాల, జెసిఐ నుంచి హెచ్‌జిఎస్.అనురాధ, ఎస్ఎమ్ఎ జోన్ డైరెక్టర్ జెసిజి.శాంతి ప్రియ, ప్రముఖ కార్టూనిస్ట్, బాలల హక్కుల కార్యకర్త బి.హరి వెంకట్, ప్రముఖ ఆర్టిస్టు చెల్లూరు భాస్కరరావు, అనిల్, డి.ఆశాలత, ఆషారాజ్ (ఎన్‌జిఒ), ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.కె.కల్యాణి, విశాఖ బాలోత్సవం ఉపాధ్యక్షులు కె.రమాప్రభ, డిస్ట్రిక్ట్ ఇంటరాక్ట్ ఛైర్మన్ మోదాంబిక, విసిసి ప్రతినిధి ఎ.మణి పాల్గొన్నారు. బాలోత్సవంలో పాల్గొనేందుకు ఇతర వివరాల కోసం 9490098794ను సంప్రదించాలని కోరారు.

బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

ఆశా కార్యకర్తల మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన 36 గంటల నిరవధిక మహాధర్నా పోస్టర్‌ను ఆశా వర్కర్ల యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.మణి, అధ్యక్షులు ఎస్.పద్మ, ప్రధాన కార్యదర్శి మేరీ, కోశాధికారి సీతాలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఈ నెల 14న ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మహా ధర్నా జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లగను ఆశాలుగా గుర్తించాలని, పని భారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆశా కుటుంబంలో మరొకరికి ఉపాధి కల్పించాలని, నష్టపరిహారం చెల్లించాలని, రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పెన్షన్ నెలకు రూ.10 వేలు చెల్లించాలని కోరుతూ ఈ ఆందోళన సాగుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే ఈ డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డితో జరిగిన అంగన్వాడీల చర్చలు విఫలమవడంతో మంగళవారం నుంచి జరగనున్న అంగన్వాడీల సమ్మెకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక అంశాలు మినహా స్వల్ప విషయాలను పరిష్కారం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సమ్మెకు వెళ్లాలని అంగన్వాడీ యూనియన్లు నిర్ణయించాయని కుమార్ తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాటలు చెప్పడం మినహా అంగన్వాడీలకు చేసిందేమీ లేదన్నారు.

ప్యాకేజీ కోసమే సాధిక్ పార్టీ మార్పు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వలాభం కోసం వైసిపిలోకి వచ్చిన 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ ఇప్పుడు పార్టీకి రాజీనామా చేసి ప్యాకేజీ కోసం పోయారని వైసిపి 36, 38, 39 వార్డుల బాధ్యులు, శ్రీ కనకమాలక్ష్మి దేవస్థానం ఛైర్పర్సన్ కొల్లి సింహాచలం ఆరోపించారు. సోమవారం లక్ష్మీటాకీస్ సమీపంలోని శెట్టి బలిజ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ విడిచి వెళ్లి వైసిపి నేతలపై నిందారోపణలు చేయడం సరికాదన్నారు. 39వ వార్డులో క్యాడర్ అంతా పార్టీలోనే ఉందన్నారు. సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ ససపల రవీంద్ర భరత్, పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ యాసీన్ పాల్గొన్నారు.

విజెఎఫ్ ఎన్నికలకు భారీగా నామినేషన్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎనిమిది సంవత్సరాల తర్వాత ఈ నెల 22న జరగనున్న వైజాగ్ జర్నలిస్టుల ఫోరం (విజెఎఫ్) ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. ఆరుగురు కార్యవర్గ సభ్యులతో పాటు మొత్తం 11 పోస్టులకు 64 మంది నామినేషన్లు వేశారు. అధ్యక్ష పదవికి ఆరు నామినేషన్లు వచ్చాయి. అయితే ఒకే అభ్యర్థి రెండు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఐదుగురు పోటీ పడుతున్నట్లు చెప్పవచ్చు. ఉపాధ్యక్ష పదవికి ఏడుగురు, కార్యదర్శి పదవికి నలుగురు, సహాయ కార్యదర్శి పదవికి 11 మంది, కోశాధికారి పదవికి ఎనిమిది మంది, ఆరుగురు కార్యవర్గ సభ్యుల పదవులకు 28 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన మంగళవారం ఉంటుంది. ఉపసంహరణ గడువు బుధవారం సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంది. ఎన్నికలు 22న జరగనున్నాయి. ఇదిలా ఉండగా ప్రజాశక్తి ఫొటో జర్నలిస్టు కుంచం రాజేష్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సోమవారం నామినేషన్ వేశారు. పలువురు జర్నలిస్టులు ఆయనకు మద్దతుగా నిలిచారు.

నామినేషన్ వేస్తున్న రాజేష్

పోస్టులు పెంచాలి

విజెఎఫ్ కార్యవర్గ సభ్యుల పోస్టులను పెంచాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్.రామచంద్రరావు, నిట్టల శ్రీనివాస్, ధవలేశ్వరపు రవికుమార్, పి.సత్యనారాయణ ,కె. చంద్రమోహన్ ఉన్నారు.

IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE NARSIPATNAM
O.S. 61/2020

Between:
1. Maddu Venkata Satyanarayana (Sincedied) L.Rs. by
2. Madbu Ramanamma
3. Maddu Lakshmi Venkata Satya Narasimhanaidu
4. Maddu Anusha
5. Maddu Atchiyyama

...Plaintiffs

And
Maddu Vijaya Prasad, S/o. Sanyasinaidu ...Defendant

To
Maddu Vijaya Prasad, S/o. Sanyasinaidu,33 years, Hindu, Business, r/o. Rolugunta (v) and Mandal, Anakapalle District

In the above **O.S. 61/2020** you are the sole Defendant and Summonses were not served on you. Hence as per the orders of the Honourable Court, You are requested to appear before the Honourable Court in order to defend your case. The above matter is stands posted to **20-12-2023** By **10-30 a.m.**, for your appearance this publication is issued by way of substitute service. On your failure, you will be set exparte.

Sri R.D.V.G.V./PRASAD
ADVOCATE
Narsipatnam
Date: 11/12/2023 **NARSIPATNAM**

వేతన బకాయి చెల్లించి ఆదుకోండి

ప్రజాశక్తి- సీతమ్మధార : మూడు నెలల వేతనబకాయి చెల్లించి ఆదుకోవాలని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టులో పనిచేస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్,వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లాఅధ్యక్షుడు బి.రవిచంద్ కోరారు. రాష్ట్రంలోని 26జిల్లాల్లో దాదాపు ఆరు వేలమంది సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టులో ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారన్నారు. మూడు నెలులగా వేతనాలు అందకపోగా, ఇపుడు నాలుగో నెలలోనూ జీతం అందక అప్పు పుట్టని పరిస్థితుల్లో కుటుంబపోషణ భారమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నెలసరి ఇచ్చే వేతనం రూ.14,200 ఎటూ సరిపోవడం లేదన్నారు. ఎన్నికలకు ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయడంతోపాటు కనీస వేతనం అమలు చేయాలని, వేతన బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు.

యువగళం పాదయాత్రలో మాజీ జెడ్పిటిసి

లోకేష్‌తో మాజీ జెడ్పిటిసి ఉమ, సూర్యనారాయణ దంపతులు

ప్రజాశక్తి- ఆనందపురం: టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర మూడు వేల కిలోమీటర్లు పూర్తి చేసిన సందర్భంగా తునిలో జరిగిన కార్యక్రమంలో ఆనందపురం మాజీ జెడ్పిటిసి బమ్మిడి ఉమ, మాజీ సర్పంచ్ బమ్మిడి సూర్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం ప్రకటించారు. టిడిపి బలోపేతానికి , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు

అన్నసమారాధన

అన్నసమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ సునీత దంపతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఆరిలోవ కాలనీ, శివాజీనగర్‌లో శివపంచాయతన అన్నపూర్ణ సమేత ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయంలో అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పిల్లి వీర్రాజు ఆధ్వర్యంలో అన్నసమారాధనలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, మధు, రమణ, సత్యనారాయణ, నరసింహమూర్తి, అచ్యుతరావు, ప్రకాషరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా పెందుర్తి శివాలయంలో మాజీ కార్పొరేటర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు శరగడం చినఅప్పలనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం జరిపించారు. అన్నసమారాధన ప్రారంభించారు.

16న గీతం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఈనెల 16న 'హోం కమింగ్' పేరిట నిర్వహించనున్నట్లు గీతం పూర్వ విద్యార్థుల సంఘం డిప్యూటీ డైరక్టర్ పి.నవీన్ తెలిపారు. సోమవారం గీతం ప్రాంగణం నుంచి ఆర్‌కె.బీచ్ వరకు పలువురు పూర్వ విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ఏడాది పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రముఖ సంస్థలలో ప్రతిభను చాటుతూ కీలకస్థానాలకు ఎదిగిన పలువురు గీతం పూర్వ విద్యార్థులను అవార్డులతో సన్మానించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సాంకేతిక ఉత్పత్తుల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో భాగంగా నిర్వహిస్తామన్నారు. ఈ సైకిల్ ర్యాలీలో భాగంగా ఈ నెల 16వ తేదీ వరకు గీతం పూర్వ విద్యార్థులను కలిసి వారిలో స్ఫూర్తి నింపాలన్నది తమ ఉద్దేశ్యమన్నారు.

నిధులు మంజూరైనా నిర్మాణంలో జాప్యం!

▸▸ రెండున్నరేళ్లయినా ముందుకు కదలని డ్రైనేజీ పనులు

▸▸ మురుగు, దుర్వాసన, దోమల బెడదతో జనం అవస్థలు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు కృష్ణానగర్‌లోని నాలుగు వీధుల్లో డ్రైనేజీల నిర్మాణానికి రెండున్నరేళ్ల క్రితమే నిధులు మంజూరైనా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు.దీనిపై పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు మొరపెట్టుకున్నా ఎటువంటి స్పందన లేదని వాపోతున్నారు.

కృష్ణానగర్‌లో నిర్మాణానికి నోచుకోని శిథిల డ్రైనేజీ

కృష్ణానగర్‌లో వీధికాలువలు పాడై, మురుగునీరు, దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో డ్రైనేజీలు మరమ్మతులు, పునర్నిర్మాణానికి రెండున్నరేళ్ల క్రితం రూ.16లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులుమంజూరైనా నేటికీ నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించలేదు. అయితే పనులకు శంకుస్థాపన చేసేందుకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సుముఖంగా ఉన్నప్పటికీ, వైసిపి నేతల అంతర్గత కలహాల వల్లే శంకుస్థాపనకు జాప్యం జరుగుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీంతో శిథిల కాలువలతో మురుగునీరు ముందకు సాగక మురుగునీరు, దుర్వాసన,దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా మంజూరైన నిధులతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

అనంతుని దీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -పద్మనాభం: పద్మనాభం కొండపైన అనంత పద్మనాభస్వామి, కొండ దిగువన కుంతీ మాధవస్వామి. ఆలయాల్లో ఈనెల 12న దీపోత్సవాన్ని అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవస్థానం ఇఒ నానాజీబాబు, స్థానిక సిఐ ఎం.సన్యాసినాయుడు వివరాలను వెల్లడించారు. ఆలయానికి నాలుగు దిక్కుల నుండి భక్తుల రాకపోకలకు వీలుగా ప్రత్యేక వాహన పార్కింగులు ఏర్పాటు చేశారు. విజయనగరం వైపు నుంచి వచ్చే వాహనాలకు. అర్చుకులపాలెం కాలేజీ వద్ద. సింహాచలం వైపు నుండి వచ్చిన వాహనాలను. మద్ది ఇటుకల బట్టీల ప్రాంగణాల్లోనూ. తగరపువలస వైపు నుంచి వచ్చిన వాహనాలకు స్ప్రింగ్ ఫీల్డ్ ప్రైవేట్ పాఠశాల సమీపంలోనూ ఏర్పాట్లు చేశారు. పోలీసుల సహకారంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేయడంతోపాటు, విఐపిల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లక్ష మంది భక్తులు అనంతుని దీపోత్సవంలో పాల్గొంటారన్న అంచనాకు తగ్గట్టుగా ప్రతి మెట్టు వద్ద వాటర్ ప్యాకెట్లను, భక్తులు దీపాలు వెలిగించేందుకు ప్రతిమెట్టుపైనా ఇరువైపులా ప్రమిదలతో ఒత్తులు, నూనె ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీపోత్సవం సందర్భంగా భక్తుల వినోదానికి మంగళవారం సాయంత్రం నాలుగు పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- పెందుర్తి : ఓటు హక్కు నమోదుపై స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత విలువైన స్థానం ఉందని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా తమ పేర్లు నమోదు చేయించుకోవడంతో పాటు విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్యాం, ప్రిన్సిపల్ ఎన్ఇ. ఫ్లోరా, ప్రసాద్, కళాశాల సెక్రటరీ టీ థియోపిలస్, ఆర్ఐ సాయికిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మంజుల, గౌతమ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో ఎలక్ట్రిక్ బైక్ రూపకల్పన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలో శొంఠ్యాంలోని నడింపల్లి సత్యనారాయణరాజు ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రికల్ బైక్‌ను సోమవారం క్యాంపస్ ఆవరణలో ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ శంభుప్రసాద్ మాట్లాడుతూ, సాంకేతికత, పర్యావరణ స్పృహతో కూడిన రవాణాకు వీలుగాహరిత సాంకేతికతను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో తమ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకుల కృషిని అభినందించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాపతి డాక్టర్ ఆర్ఎస్ఆర్ కృష్ణంనాయుడు మాట్లాడుతూ,కళాశాల యజమాన్యం నిరంతర ప్రోత్సాహంతోనే పర్యావరణ హితమైన ఎలక్ట్రికల్ వాహనాలు తయారీ సాధ్యమైందన్నారు. డైరెక్టర్ డాక్టర్ జైరాజా మురుగదాస్ పాల్గొన్నారు.

ఇ-బైక్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ శంభుప్రసాద్

అవసాన దశకు వైసిపి!

ప్రజాశక్తి -గాజువాక: చీలికలు, పీలికలతో వైసిపి అవసాన దశకు చేరుకోవడం ఖాయమని గాజువాక నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదులశ్రీనివాస్ అన్నారు. సోమవారం పాత గాజువాక టిడిపి కార్యాలయంలో మాట్లాడుతూ, గాజువాకలో తిప్పల దేవన్‌రెడ్డి, మంగళగిరిలో ఎమ్మెల్యే ఆళ్ల రాజీనామాలతో ఆరంభమై, మున్ముందు మరింత మంది వైసిపికి దూరం కావడం ఖాయమన్నారు. లోకేష్ యువగళం చారిత్రాత్మక పాదయాత్ర మూడువేల కిలోమీటర్ల మైలురాయి పూర్తి చేయడం, అదే సమయంలో విశాఖ జిల్లాలో కాలిడిన వెంటనే వైసిపి గుండెల్లో గుబులు మొదలైందని, అది పతాక స్థాయికి చేరుకుని వైసిపిని బంగాళాఖాతంలో ముంచేయడంతో ముగుస్తుందన్నారు. గాజువాక నియోజకవర్గ బిసి విభాగం అధ్యక్షులు తమ్మిన శివ ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, వార్డు అధ్యక్షులు రట్టి వాసు, కోయిలాడు శంకరరావు, వెల్లూరు శివప్రసాద్, ముద్దాన లక్ష్మీనారాయణ, గుడి గురుమూర్తి, కొరికాన చంద్రరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గల్లంతైన విద్యార్థి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - పద్మనాభం : గోస్తనీ నదిలో గల్లంతైన విద్యార్థి పొన్నగంటి హరిబాబు ఆచూకీ లభ్యమైంది. మండలంలోని పాండ్రంగి పంచాయతీ కొర్రపల్లి వద్ద దివాన్జీ కాలువలో జారిపడిన హరిబాబు మృతదేహాన్ని ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టగా, సోమవారం సాయంత్రం లభ్యమైంది. కాగా అంతకుముందు గల్లంతైన విద్యార్థి ఆచూకీకి గాలింపు చర్యల్లో అలసత్వంపై విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, సంబంధీకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు సమాచారాన్ని కలెక్టరేట్‌కు నివేదించగా, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టి, విద్యార్థి మృతదేహం ఆచూకీని కనిపెట్టాయి.

మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు

భీమిలి ఎంపిడిఒగా జానకి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎంపిడిఒగా డాక్టర్ వి.జానకి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జిల్లా నీటి యాజమాన్యసంస్థ కార్యాలయంలో అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేస్తూ బదిలీపై భీమిలి వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన వెంకటరమణను విజయనగరం జిల్లా విజిలెన్స్ అధికారిగా ప్రమోషన్‌పై వెళ్లగా, ఆనందపురం ఎంపిడిఒ లవరాజు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహించారు. రెగ్యులర్ ఎంపిడిఒగా విధుల్లో చేరిన జానకి, ఇఒపిఆర్‌డి అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం హౌసింగ్ ఎఇతో కలిసి మూలకుద్దులో జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

ఎంపిడిఒ డాక్టర్ జానకి

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సురేష్ యాదవ్

ప్రజాశక్తి -ములగాడ: 59వ వార్డులో ప్రజలకు ఆధార్ సేవలను చేరువ చేసే లక్ష్యంతో ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ సచివాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పశ్చిమ నియోజకవర్గ వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సురేష్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయ పనిదినాలలో కొత్త ఆధార్ నమోదు, డాక్యుమెంట్, బయోమెట్రిక్ అప్‌డేషన్, ఆధార్‌కు మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి అన్ని అధార్ సేవలను పొందవచ్చన్నారు. వార్డు అధ్యక్షులు రేవల్ల సత్యనారాయణ, కన్వీనర్లు అమరావతి, ఖలీషా, సచివాలయ అడ్మిన్ అచ్యుతరావు, సుధీర్, సుదీప్తి, కూసి. స్వరూప, డొక్కాడ. స్వరూప, నాయకులు ఖాన్ పాల్గొన్నారు

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం ఆనందపురం పిహెచ్‌సిలో 39 మంది గర్భిణులకు గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం.రత్నావళి వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు హెచ్‌బి, బిపి, సుగర్ ఇతర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. వారికి తగు ఆరోగ్యసూచనలు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ గంగునాయుడు, షహనాజ్ సాదియా, సిహెచ్ఒ సాంబమూర్తి, పిహెచ్ఎన్ కృష్ణవేణి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఈశ్వరరావు పాల్గొన్నారు

ఆదమరిస్తే అంతే సంగతులు!

- జాతీయరహదారిపై భారీగా పేరుకుపోయిన ఇసుక మేటలు
- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల కురిసిన వర్షాలకు కొండపై నుంచి వచ్చే నీరుతోపాటు ఇసుక కొట్టుకొచ్చి జాతీయరహదారిపై పెద్దఎత్తున మేటలు వేసింది.ఇవి వాహనదారులకు ప్రాణసంకటంగా ఉన్నాయనే ఆందోళన వ్యక్తమౌతోంది. జాతీయరహదారి వెంకోజీపాలెం నుంచి హనుమంతువాక వైపు వెళ్ళే మార్గం, పండ్ల దుకాణం వద్ద సుమారు 20 అడుగుల దూరం వరకు భారీగా ఇసుక మేటలు పేరుకుపోయాయి. ఎక్కువ రద్దీగా ఉండే ఈ రహదారిలో వందల కొద్ది వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. అంతేకాక ఈ మార్గంలో ఇప్పటికే రోడ్డు ప్రమాదాల రేటు కూడా అధికంగానే ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇదే రోడ్డులో ఇసుక మేటలు పేరుకుపోవడంతో, వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వచ్చినా,అతివేగంగా ప్రయాణించినా ఇసుక కారణంగా స్కిడ్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది.

గత నెలలో జాతీయరహదారి జూపార్కు సమీపంలో ఇసుక మేట వేసిన కారణంగానే మధురువాడ వైపు బైకు

హనుమంతువాక, వెంకోజీపాలెం మార్గంలో ఇసుక మేటలు

వెళ్తున్న యువతి వాహనం స్కిడ్ అయ్యి రోడ్డుపై పడిపోవడంతో, అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న భారీ వాహనం ఆమె తలపై నుంచి వెళ్ళిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. హెల్మెట్ ధరించినా ఫలితం లేకపోయింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే జాతీయరహదారిపై వేసిన ఇసుక మేటలను తక్షణమే తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేశాకే...

రోడ్డు విస్తరణ చేపట్టాలి

జివిఎంసి కౌన్సిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఎన్ఎడి కొత్త రోడ్డు, ఎన్ఎస్‌టిఎల్ ఫ్యామిలీ గేటు నుంచి, సుసర్ల కాలనీ, లక్ష్మీ నగర్ మీదుగా ఇంద్రానగర్ నుంచి సింహాచలం రోడ్డుకు కనెక్ట్ అయ్యే రోడ్డు విస్తరణ పనులను ప్రజలకు ఇబ్బంది లేకుండా వారి ఆమోదం మేరకు పనులు చేపట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సూచించారు. సోమవారం జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో దీనిపై మాట్లాడుతూ, ఇరుకైన స్థలంలో 60 అడుగులకు రోడ్డును విస్తరిస్తే చాలామంది కుటుంబాలు వీధిన పడతాయని, అనేకమంది నిర్వాసితులౌతారన్నారు. నిర్వాసిత కుటుంబాలకు రోడ్డు విస్తరణపై అవగాహన కల్పించి, వారికి పునరావాసం కల్పించడంతోపాటు పూర్తి న్యాయం చేయడం ద్వారా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం మంచిదని కోరారు.

ఉత్తమ సోషల్ వర్కర్‌గా వెంపాడ

భువనేశ్వర్ మేయర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి -తగరపువలస : ఉత్తమ సోషల్ వర్కర్‌గా స్థానిక వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వెంపాడ శ్రీనివాసరెడ్డి అవార్డును అందుకున్నారు. సోమవారంఒడిషా రాష్ట్రం, భువనేశ్వర్‌లో మేయర్ సులోచనాదాస్‌నుంచి అవార్డును స్వీకరించినట్లు తెలిపారు.

ఎస్‌సి బాలుర హాస్టల్ విద్యార్థులను

సురక్షిత భవనంలోకి తరలించండి

భీమిలి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న కృష్ణమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, ప్రమాదభరితంగా ఉన్న భవనంలోంచి స్థానిక ఎస్‌సి బాలుర కళాశాల హాస్టల్ విద్యార్థులను వేరే భవనంలోకి తరలించాలని స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షులు రాజేటి బసవ కృష్ణమూర్తి కోరారు. సోమవారం విద్యార్థులతో కలిసి స్థానిక ఆర్‌డిఒ ఎస్ భాస్కరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. హాస్టల్ భవనం పైకప్పు పెచ్చులూడి ఇప్పటికే విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయని, ప్రాణాపాయ ప్రమాదం జరగకముందే విద్యార్థులను సురక్షిత భవనంలోకి తరలించాలని కోరారు. విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కర్రి నరేష్, కొయ్య రామకృష్ణ, ఎస్‌వి రాజారెడ్డి, వి చరణ్ ఉన్నారు

డైట్‌లో ఘనంగా కళా ఉత్సవ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో సోమవారం కళా ఉత్సవ్ ఘనంగా నిర్వహించారు రెండ్రోజుల పాటు జరుగనున్న ఈ ఉత్సవాలకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు చెందిన 18 ప్రభుత్వ పాఠశాలల నుంచి 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు..ఉత్సవాన్నిడైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ ప్రారంభించగా, వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ జి రవి, అధ్యాపకులు పాల్గొన్నారు

సీతంరాజు చొరవతో బాధితులకు పరిహారం

సుధాకర్‌కు కృతజ్ఞతలు చెబుతున్న బాధిత కుటుంబీకులు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి పరిహారం అందేలా చొరవచూపిన దక్షిణ నియోజకవర్గ వైసిపి నేత సీతంరాజు సుధాకర్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. అచ్యుతాపురం యూనిపార్ట్స్ కంపెనీలో జూలై 28న జరిగిన ప్రమాదంలో మొహమ్మద్ మెహబూబ్ అలీ అనే కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. మృతునికి భార్య నసీమ, మూడేళ్ల కొడుకు ఉన్నాడు.

అయితే కార్మికుడు మృతి చెందినప్పటికీ, బాధిత కుటుంబానికి పరిహారం అందడంలో తీవ్ర జాప్యంపై సమస్యను 39వ వార్డు ముస్లిం మైనార్టీ నాయకుడు అఫ్సర్‌ఖాన్ దృష్టికి తేగా, ఆయన దక్షిణ నియోజకవర్గ వైసిపి నేత సీతంరాజు సుధాకర్‌కు సమస్యను విన్నవించారు. ఆయన వెంటనే స్పందిచడంతో బాధిత కుటంబానికి రావాల్సిన రూ17.60లక్షల పరిహారం అందింది. పరిహారం అందుకున్న బాధితులు, తమకు సహకరించిన సీతంరాజు సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో విశాఖ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి -మధురవాడ : ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో జరిగిన సబ్ జూనియర్, క్యాడెట్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో మధురవాడ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి 650మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విశాఖ నుంచి పది మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో ఏడుగురు పతకాలను సాధించారు జి బాషిత, కె ధనలక్ష్మి స్వర్ణపతకాలు, పి జ్ఞానసిరి రజత పతకం, పి జస్వంత్, డి నాగ్ చేరన్, ఎ నిత్యశ్రీ, ఎం గాయత్రి కాంస్య పతకాలు సాధించారు. విజేతలతోపాటు కోచ్ కె.సుకుమార్ సంపత్‌ను ఎపి తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అచ్చుతరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అచ్చిం నాయుడు

తైక్వాండోలో పతకాలు సాధించిన మధురవాడ క్రీడాకారులు

అభినందించారు. తైక్వాండో యూత్ కోచ్ సురేశ్ హర్షం వ్యక్తం చేసారు. విజేతలను శ్రీకనకదుర్గా సప్లయర్స్, క్యాటరింగ్ అధినేత కొర్రాయి సురేష్ అభినందించారు.

మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం: సామాజికంగా, ఆర్థికంగా వెనుకడిన మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని పలువురు వక్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.సోమవారం జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ, చొక్కవానిపాలెంలో ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన మత్స్యకార దినోత్సవం నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం, తుఫాను నేపథ్యంలో గత నెల 21న జరగాల్సిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎపి మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్ మాట్లాడుతూ, సముద్ర తీరానికి సమీపంలోనే మత్స్యకారులకు ప్రభుత్వం ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలనే న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మత్స్యకార నాయకులు కారి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో వాసుపల్లి నల్లబాబు, గరికిన ఎల్లయ్య, మారుపల్లి అమర్‌నాథ్ తదితర మత్స్యకార నేతలు మాట్లాడుతూ, ప్రపంచ దేశాలన్నీ నిషేధించిన కాలుష్య కారక

సభలో మాట్లాడుతున్న విజయచందర్

పరిశ్రమలకు దేశంలోనూ,రాష్ట్రంలోనూ అనుమతులివ్వడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కెమికల్ ఫ్యాక్టరీలతో సముద్రజలాలను కాలుష్యకారకం చేయడంతోపాటు మత్స్యసంపదను నాశనం చేసి తమ జీవనోపాధిని, మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమను ఓటుబ్యాంకుగా చూడడం మానేయాలన్నారు. సంఘం అధ్యక్షులు చొక్కా భాస్కరరావు, కార్యదర్శి సిహెచ్ అప్పారావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సత్తిరాజు, కోశాధికారి కర్రి ఎర్రయ్య పాల్గొన్నారు. అనంతరం పేద మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు

వంద రోజుల్లో ఒరగబెట్టిందేమీ లేదు

-గుర్తింపు యూనియన్లపై ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నేతల విమర్శ

ప్రజాశక్తి -గాజువాక : భెల్, హెచ్‌పివిపి యూనిట్లతో ఎఐటియుసి, యునైటెడ్ ఫ్రంట్ గుర్తింపు యూనియన్‌లుగా ఎన్నికై వంద రోజులు గడుస్తున్నప్పటికీ సాధించిందేదీ లేదని, ప్రోగ్రెసివ్ ఫ్రంట్, ప్రధాన కార్యదర్శి వి.బాబూరావు విమర్శించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో 18 అంశాలు పెట్టి, వాటిని అమలును తుంగలో తొక్కేశారన్నారు. కార్మికులను మభ్యపెట్టడంతోపాటు, యువ కార్మికులకు లేనిపోని ప్రలోభాలకు గురి చేసారని ఆరోపించారు.. అధ్యక్షులు జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, మేనిఫెస్టోను పక్కన పెట్టి, కేవలం మూమెంట్ పాసులంటూ విలువైన కాలాన్ని వృథా చేసి, కార్మిక హక్కులను ఒక్కటొక్కటిగా కాలరాస్తున్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు నిజాయితీగా పనిచేస్తే గుర్తింపు యూనియన్‌కు పూర్తి సహకారం అందిస్తామని, అదే సమయంలో హామీలు అమలు చేయకపోతే, కార్మికులను కలువుకుని ఆందోళనకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీత నాయుడు, కె.విజయ్ కుమార్, ఎస్ జగన్నాధరావు, మురళీశ్వరరావు, పి కనకారావు, సిహెచ్‌వి. నారాయణ, ఎన్ నవీన్ కుమార్, చిట్టిబాబు పాల్గొన్నారు. .

ఆధునికీకరణకు నిధులు మంజూరుపై హర్షం

జివిఎంసి కమిషనర్‌ను సత్కరిస్తున్న కెకె.రాజు, వైసిపి నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం పరిధిలో సీతమ్మధార అల్లూరి విగ్రహం నుంచి మాధవదార, ఆర్అండ్‌బి మేరియట్ హోటల్ జంక్షన్ వరకు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు విస్తరణ, పుట్‌పాత్‌ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, ప్లాంటేషన్, సుందరీకరణ ఇతర అభివృద్ధి పనులకు విశాఖ పోర్టు సిఎస్ఆర్ నిధులు రూ.34.75కోట్లను విడుదల చేయడంపై నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, ఇతర నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మను కలిసి, ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, బర్కత్ అలి, కెవిఎన్ శశికళ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మోహిత్‌కు స్వర్ణం

మోహిత్‌ను అభినందిస్తున్న కాలేజీ చైర్మన్, ప్రిన్సిపల్

ప్రజాశక్తి -గాజువాక : ఇటీవల విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీనగర్‌లోని టిఎస్ఆర్ టిబికె కళాశాల విద్యార్థి ఆర్‌విఎస్‌కె మోహిత్ సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. మరో విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పథకం సాధించారు. ఈ సందర్భంగా మోహిత్‌ను కళాశాల చైర్మన్ టి బలరామకృష్ణ, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ అభినందించారు.

యుటిఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా అప్పారావు

తాడాన అప్పారావు

ప్రజాశక్తి -గాజువాక :యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తాడానా అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ యూనియన్ గాజువాక మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌వి. శ్రీనివాస్, సబ్బారపు నూకరాజు తెలిపారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గంలో అప్పారావు ఎంపికతో గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో యుటిఎఫ్ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తుపాన్ పరిహారానికి రోడ్డెక్కిన అన్నదాతలు

రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతు సంఘాల నాయకులు, రైతులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మిచోంగ్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండల రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రైతులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక సహకార సంఘం నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేశారు. తరువాత రైతు భరోసా కేంద్రం, తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ తుఫాను కారణంగా నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం ప్రకటించాలనారు. నేటికీ అధికారులు గ్రామాల్లో పంట నష్ట నమోదుకు రాకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం డిటి వినయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి జోత్స్నకుమారి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, ఎపి రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, సీఐటీయూ నాయకులు వివి శ్రీనివాసరావు, తెలుగురైతు నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసిలి నాయుడు, పెంటకోట విజయ్, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, జనసేన నాయకులు టెక్కలి పరుశురాం, ఆడారి శ్రీకాంత్, వైఎస్ఆర్ రైతు నాయకులు మల్ల సంజీవరావు, ఆడారి లక్ష్మణరావు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యాన నిరాహార దీక్ష

చోడవరం : తుఫాన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎస్ఎన్ రాజు 24 గంటల నిరాహార దీక్ష సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పంటలు పూర్తిగా నీట మునిగి రైతులు నష్టపోయారని, ప్రభుత్వ కనీసం వాటి వైపు చూడకుండా ప్రకటన చేయడం సిగ్గు చేయటని పేర్కొన్నారు. ఈ దీక్షకు టిడిపి నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజు మండలంలో పంటలు నష్టపోయిన 75 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున తమ సొంత నిధులతో పరిహారం అందించారు.

నిరాహార దీక్ష చేస్తున్న జనసేన నాయకులు

పతకాలు చూపుతున్న విద్యార్థులు

కరాటే పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కశింకోట : జాతీయస్థాయి కరాటే పోటీల్లో కశింకోట సెయింట్ జోన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 9, 10 తేదీల్లో సామర్లకోటలో విక్టరీ సొట్‌కాన్ కరాటే అసోసియన్ ఆధ్వర్యంలో జాతీయ కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థులు కె.పనీష్, వై.ఆసీస్ అరివిందు, వైపి ప్రీనిత్ సాయి, కెవి.జోసెప్ బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాలలో సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆకాడమిక్ ఇంఛార్జి రూపానంద, ప్రిన్సిపల్ చంద్రకళ, కరాటే కోచ్ సిహెచ్ సూర అప్పారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. తిరస్కరించిన వారికిచ్చే సమాధానంలో అందుకు గల కారణాలను వివరించాలన్నారు. స్పందనకు 338 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, డిఆర్ఓ బి.దయానిధి, ఎస్‌డిసి డాక్టర్ ఏ.మహేష్, డిఆర్‌డిఎ పిడి ఈ.సందీప్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయ స్పందనకు 36 ఫిర్యాదులు

జిల్లా ఎస్‌పి కార్యాలయంలో అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీల్లో భూ తగాదాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టిడిపి నేతల కేక్ కటింగ్

ప్రజాశక్తి-కశింకోట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని చింతలపాలెం గ్రామంలో సోమవారం టిడిపి నాయకులు కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతెన శ్రీనివాసరావు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, మాజీ సర్పంచ్ కర్రి దురునాయుడు, జెర్రిపోతుల నూకునాయుడు, ఉల్లింగల రమేష్, గూడుపు ప్రకాష్, సేనాపతి కృష్ణ, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీష్

రైతుల కష్టాలు మంత్రికి కనబడలేదా?

ప్రజాశక్తి-అనకాపల్లి : తుఫాను కారణంగా వేలాది ఎకరాల్లో రైతాంగం పంటలు పోయి నష్టపోతే కనీసం మంత్రి అమర్నాథ్ ఎక్కడా పర్యటించిన దాఖలాలు లేవని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా మంత్రి గుడివాడ అమర్నాథ్ తుఫాను కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని చూడడానికి, ఆదుకోవడానికి ఎక్కడ కనబడటం లేదని విమర్శించారు. కోట్లకు పడగలెత్తిన మంత్రి బాధలతో ఉన్న రైతులను చూడడానికి తీరిక లేదా? అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు దేవరాపల్లికే పరిమితమయ్యారని, జిల్లాలో ఉన్న సమస్యలు ఆయనకు పట్టవా, మాడుగులకు మంత్రా? రాష్ట్రానికి మంత్రా అని ఎద్దేవా చేశారు. తుపాన్ వల్ల జరిగిన నష్టంతో కేవలం 10 శాతం నష్టపరిహారం ఇవ్వడానికి సిద్ధపడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, విల్లూరి రమణబాబు, సాలాపు నాయుడు, మల్ల గణేష్ పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : బ్రాండిక్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం 10వ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 25 మంది రక్తదానం చేశారు. బ్రాండ్స్ ఇండియా పార్ట్నర్ దొరస్వామి కూడా రక్తం ఇచ్చారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకూ నిర్వహించిన 10 శిబిరాల ద్వారా మొత్తం 150 మంది దాతలు రక్తదానం చేశారని, వారందరికీ హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. శిబిరంలో మహిళలు కూడా ముందుకొచ్చి రక్తదానం చేయడం విశేషమన్నారు. ఒకసారి రక్తం ఇచ్చిన తర్వాత మూడు నెలల తర్వాత మళ్లీ రక్తం ఇవ్వవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్రాండిక్స్ ఇండియా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం నేతలు అప్పారావు, అప్పలరాజు

మాట్లాడుతున్న రైతు సంఘం నేత అప్పలరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

మిచౌంగు తుఫాన్ కారణంగా అనకాపల్లి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, వారికి ప్రభుత్వం ఉదారంగా నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామనాయుడు కార్మిక కర్షక నిలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌కు 1,06,000 ఎకరాల్లో వరి పంట వేయగా, ఇందులో 20 వేల ఎకరాలు కరువు కారణంగా ఎండిపోయిందని, ఇప్పుడు తుఫాన్‌కు 60 వేల ఎకరాలకు పైగా పంట నీట మునిగి నష్టం జరిగిందని తెలిపారు. తుఫాన్ పోయి రోజులు గడుస్తున్నా నష్టపోయిన పంటలను నమోదు చేయలేదన్నారు. ఇటువంటి కష్టకాలంలో కూడా రైతులను ఆదుకోకపోతే వారు వ్యవసాయం చేయడానికి ముందుకు ఎలా వస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు భారీగా పెరిగి, పంటలకు గిట్టుబాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తుఫాను కారణంగా నష్టపోయిన పంటకు ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, నాయకులు ఎ.రాజు, ఎ.కొండలరావు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

తుఫాన్ వలన వరి, చెరుకు, అరటి మొదలైన పంటలు నీట మునిగి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి నష్టపరిహారం చెల్లించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులు, కౌలుదార్లకు నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈనెల 14న అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాలని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మని కలిసి ధర్నా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సర్వీస్ రూల్స్, బదిలీలు, పిఎఫ్ అకౌంటులు, డిప్యూటీ డీఈవో పోస్టులు, అర్బన్ ఎంఈఓ పోస్టుల భర్తీ, దీర్ఘకాలికంగా సస్పెన్స్ అకౌంటులో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల అరియర్ సొమ్ము విడుదల తదితర అంశాలపై ఈ నెల 15 వ తేదీన అనకాపల్లి లో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ సంబంధిత సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి. శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు పి. గాయత్రి, అనకాపల్లి మండల ప్రధాన కార్యదర్శి సిరసపల్లి శ్రీను, మండల అధ్యక్షులు మామిడి బాబూరావు, జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, సీనియర్ నాయకులు దేముడు నాయుడు, సలీం తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

'ఆడుదాం ఆంధ్రా'పై సమీక్ష

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో. ప్రసాదు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా యువతలో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి దోహదపడుతుందని చెప్పారు. డిసెంబరు 15 నుండి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల యువతీ యువకులు గ్రామ వాలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, అధికారులు, ప్రజాప్రతినిధులు

సహజ ఔషధాలు, మూలికా వైద్యంపై అవగాహన

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : వంట ఇంట్లో సహజ ఆహారానికి వాడే మూలికలు, పరిసరాలలో దొరికే సహజ ఔషధ మొక్కల వినియోగంతో సులభంగా వ్యాధిని తగ్గించుకోవచ్చని ఆయుర్వేద, ప్రకృతి సాంప్రదాయ వైద్యులు పేర్కొన్నారు. పారంపర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో సహజ పద్ధతిలో వ్యాధిని నయం చేసుకునే పద్ధతులపై స్థానిక రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు మాట్లాడుతూ వ్యాధి ఔషధం కంటే ఆహారపు అలవాటులతోనే తగ్గుతుందన్నారు. భవిష్యత్ తరాలకు ధనం, విద్యతో పాటు ఆరోగ్యాన్ని ఆరోగ్యం ఇవ్వాలంటే ఔషధ మొక్కలను, వృక్షాలను పెంచాలన్నారు. ఈ సందర్భంగా అనేక రకాల మొక్కలను వసుదైక వనం ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వైద్యులు చంద్రశేఖర్ రాజు, అలుగోలు ప్రసాదరావు, అల్లక రాజు, ప్రసాద్, తోటద పెంచలయ్య, ఎస్.కె వల్లి, అలీ అహ్మద్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

సమగ్రంగా కుల గణన సర్వే

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో కుల గణన సర్వే అత్యంత జాగ్రత్తగా సమగ్రంగా నిర్వహించాలని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లుపై ఉందని చెప్పారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సమగ్ర కుల గణన సర్వేపై అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ కులగణన సర్వేపై సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు నవంబర్ 27 నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

వంతెనపై రాకపోకలకు అనుమతి

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట : మండలంలోని వడ్డాది పాత వంతెన పైనుండి ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలకు సోమవారం నుండి ఏర్పాట్లు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దేరు జలాశయం నుండి అధిక మొత్తంలో నీటిని విడుదల చేయడంతో నూతనంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు, గతంలోనే మరమ్మతులకు గురైన పాత వంతెనపై నుండి భారీగా నీరు ప్రవహించి, నూతనంగా నిర్మించిన కాజ్వే ఒకవైపు పూర్తిగా, పాత వంతెన పై భాగం కొట్టుకుపోయాయి. దీంతో వడ్డాది నాలుగు రోడ్లకు పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిచిపోయాయి. పాత వంతెన ధ్వంసమైన చోట రెండు రోజులుగా మెటల్ పీక్కను వేసి కొట్టుకుపోయిన చోట నింపారు. శనివారం సాయంత్రం నుండి పాదచారులకు రాకపోకలకు అనుమతినిచ్చిన అధికారులు సోమవారం నుండి చిన్న వాహనాలకు రాకపోకలకు అనుమతినిచ్చారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీతో పాడి రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆ డెయిరీ రీజనల్ మేనేజర్ పి.నాగభప్పారావు అన్నారు. తోటాడ గ్రామంలో సోమవారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక పాల దిగుబడులకు రైతులు పాటించవలసిన ముందు జాగ్రత్తలను వివరించారు. డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, సూపర్వైజర్ సూరిబాబు, రైతులు సిహెచ్ రాము, బి రామకృష్ణ, పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెరుకు తోట దగ్ధం

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన గాడి పైడిబాబు, గాడి సత్తిబాబులకు చెందిన ఎకరం విస్తీర్ణంలోని చెరుకు తోట కాలిపోయింది. పైడిబాబు, సత్తిబాబులకు చెందిన చెరుకు తోట పై భాగంలో గల విద్యుత్ స్తంభాలపై వైర్ల నుండి షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పులు చెరుకు తోటపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగి చెరకు తోట పూర్తిగా కాలిపోయింది. ఆస్తి నష్టం రూ.50వేలు ఉంటుందని రైతులు వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పొలాల మునిగిపోగా షార్ట్ సర్క్యూట్‌తో చెరుకు తోటకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.

దగ్ధమైన చెరుకు పంట వద్ద బాధిత రైతులు పైడిబాబు, సత్తిబాబు

బిల్లల మెట్ట వద్ద నల్లరాయి తవ్వకాలు ఆపాలి

సిపిఎం నేతలు వెంకన్న, దొర

తవ్వకాలు చేస్తున్న క్వారీని పరిశీలిస్తున్న వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 20లోని బిల్లల మెట్ట వద్ద అక్రమంగా జరుగుతున్న నల్లరాయి తవ్వకాలను తక్షణమే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా? అని ఏదైనా చేస్తారా? అని ఉప మంత్రి బూడి ముత్యాల నాయుడును ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం వారు బిల్లల మెట్టను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైవాడ ప్రాజెక్టుకు బిల్లల మెట్ట ఆనుకొని ఉందని, ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాలో క్వారీ తవ్వకాలు చేపట్టరాదని 2017-2018లో హైకోర్టు తీర్పు నిచ్చిందని గుర్తు చేశారు. ఈ తీర్పును వైసిపి ముఖ్య నేతలు బేఖాతరు చేస్తూ అడ్డగోలుగా నల్లరాయి తవ్వకాలు చేపట్టి, భారీ పేలుళ్లు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి పనులు పేరు చెప్పి శారదానది పరీవాహక ప్రాంతంలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని, ఇప్పుడు కొండను గుల్ల చేస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మంది విశాఖ ప్రజలకు తాగునీరు అందిస్తున్న రైవాడ ప్రాజెక్టు దెబ్బతినే అవకాశం ఉందని, అయినా ఎలా తవ్వకాలు చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమంగా తవ్వకాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పందనలో అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారాన్ని అభివృద్ధికి ఉపయోగించాలని, అలా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే పతనం తప్పదని హెచ్చరించారు.

రూ.18.90 లక్షల లా నేస్తం జమ

అనకాపల్లి జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

లా నేస్తం చెక్కు అందజేస్తున్న జెసి జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో 63 మంది యువ లాయర్లకి 6 నెలలకు రూ.18 లక్షల 90 వేలు వైయస్సార్ లా నేస్తం కింద జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె లా నేస్తం చెక్కును యువ లాయర్లకు అందజేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా "జగనన్న లా నేస్తం" కార్యక్రమం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వత్తిలో ప్రవేశించిన యువ న్యాయవాదులకు, వృత్తిలో స్థిరపడే వరకు మొదటి మూడు సంవత్సరాలు పాటు నెలకు రూ.5 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి, డిఆర్‌డిఎ పిడి శచీదేవి, ఏపీడీ డైజీ, శంకరం సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, యువ లాయర్లు పాల్గొన్నారు.

విశాఖ జిల్లాలో 166 మందికి 'లా నేస్తం'

ఎంవిపి.కాలనీ : వైఎస్ఆర్ లా నేస్తం పథకంలో భాగంగా విశాఖ జిల్లా నుంచి 166 మంది యువ న్యాయవాదులు లబ్ధిపొందారు. ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున వారివారి ఖాతాల్లో జమ అయినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ పూర్ణిమా దేవి, యుపిడి పీడీ పాపినాయుడు పాల్గొన్నారు.

ఆర్లిలో ఫ్యామిలీ ఫిజిషియన్

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని డాక్టర్ మేఘన నిర్వహించారు. గ్రామంలోని రోగులకు బిపి, షుగరు, ఆస్తమా మొదలగు దీర్ఘకాలిక వ్యాధులతో పాటు అన్ని వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేఘన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిహెచ్‌ఓ దేవి, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని భరణికం పంచాయతీ బావదపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉన్న 21 మంది విద్యార్థులకు సోమవారం పాఠశాల ఉపాధ్యాయులు నాలుగు వేల రూపాయల విలువ చేసే నోటు పుస్తకాలు, పరీక్ష అట్టలు, డ్రాయింగ్ బుక్స్, కలర్ పెన్సిల్స్, పెన్సిల్స్, రబ్బరులు, షార్పనేర్స్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లితండ్రుల కమిటీ చైర్మన్ ఎం.కళావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.రాజశ్రీ, ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధర్, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు తెలిపారు. స్థానిక సచివాలయం-1 పరిధిలో సోమవారం ఎపికి జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలోడిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి , జడ్పిటిసి పెంటకోట సోమ సత్యనారాయణ, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చంనాయుడు, పొలిమేర పూర్ణచంద్ర గణేశ్వరరావు, సర్పంచులు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, చదరం నాయుడు, ఎంపిటిసిలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : రానున్న ఎన్నికలలో వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు పిలుపునిచ్చారు. ఎపికి జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు లాలం రాము జడ్పీ కో ఆప్షన్ సభ్యులు నర్మల కుమార్, పార్టీ నాయకులు కోన బుజ్జి, ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీను అడిగర్ల దేవుడు గాడి గణేష్ శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

కాలిబాట బ్రిడ్జికి నిధులు విడుదల చేయండి

ప్రజాశక్తి- కశింకోట : శారద నదిపై కాలిబాట బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పార్లమెంట్‌లో రూల్ 377 ద్వారా కశింకోట కాలినడకన వంతెన నిర్మాణ విషయాన్ని ప్రస్తావించారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని కశింకోట గ్రామస్తులు నిత్యావసర, వ్యవసాయ కార్యకలాపాలు, పశువుల పెంపకం, సాగు కోసం శారదా నదిని దాటాల్సి వస్తుందని, వర్షాకాలంలో ఈ నది దాటడం ప్రమాదకరమని, అనేక విషాద సంఘటనలు, ప్రాణ నష్టం జరిగాయని తెలిపారు. ఈ పరిస్థితికి అత్యవసర జోక్యం చేసుకోవలసిన అవసరం ఉందని ఎంపీ సత్యవతి చెప్పారు.

శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు



భోగలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న రత్నాకర్ దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా పట్టణంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలైన్లో నిల్చున్నారు. పట్టణంలోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయం, శ్రీభోగ లింగేశ్వర స్వామి ఆలయం, శ్రీసిద్ధి లింగేశ్వర స్వామి ఆలయం, శారద నది ఒడ్డున ఉన్న ఉమా సహిత రామలింగేశ్వర ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు దాడి రత్నాకర్ దంపతులు పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి, అన్న సమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, సుదురుపాటి అప్పల నర సింహం (తాతాజీ), ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కార్తీక మాసం ఆఖరి సోమవారం పురస్కరించుకొని స్థానిక సుంకర మెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆలయ చైర్మన్ కెఎం.నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఐడబ్ల్యూసి చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబులను ఆలయ చైర్మన్ కెఎం నాయుడు దుస్సాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాలని బహూకరించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ దంపతులు, దేవుని గుమ్మం శ్రీవెంకటేశ్వర ఆలయ చైర్మన్ సకల రాజ్య లక్ష్మి, గోవిందరావు, ఈవో టి రాజ సులోచన, వాగ్దేయ వరదాయని బృంద వ్యవస్థాపకులు తిమ్మాపాత్రుని చక్రవర్తి, ఈవో కీర్తి ఆదినారాయణ, సంఘ సేవకులు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



దిలీప్ కుమార్, సూరిబాబులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

అన్న సమారాధన

మునగపాక రూరల్ : మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో శ్రీఅన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన కార్తీక మాస పూజ వ్రత కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, తన తనయుడు సతీష్ బాబుతో కలిసి హాజరయ్యారు. స్థానిక మహిళలు మంగళ హారతులు ఇస్తూ ఆయనపై పూల వర్షం కురిపిస్తూ గ్రామంలోని ఆలయం వరకు తీసుకువెళ్లారు. ఎంవిఆర్ స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎంవిఆర్ ప్రారంభించారు. అనంతరం గ్రామ పెద్దలు ఎంవిఆర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన, ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్, సంజు బాబు టీం సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు శిబిరాలకు 3 వేల దరఖాస్తులు

-నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రమీల గాంధీ

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో ఈనెల తొమ్మిది లోపు అందిన ఓటర్ల దరఖాస్తులన్నీ నిర్దేశించిన గడువులో విచారణ పూర్తి చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రమీల గాంధీ ఆదేశించారు. తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, మండలంలో అన్ని పోలింగ్ బూత్ ల వద్ద ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదులో భాగంగా 3 వేల వరకు దరఖాస్తులు అందాయన్నారు. బోగస్ ఓట్లను, డబల్ ఎంట్రీలను, వివాహమై అత్తవారింటికి వెళ్లిన పేర్లను, చనిపోయిన వారి పేర్లను పరిశీలించి వాటిని సంబంధించిన ఫార్మేట్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.రవికిరణ్, తహసిల్దార్ మహేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో హాజరైన ప్రమీల గాంధీ

హాజరైన సర్పంచ్, గ్రామస్తులు

'ఉపాధి'పై గ్రామ సభ

ప్రజాశక్తి-రావికమతం: 2022-23 ఏడాదికి సంబంధించి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి కోరారు. కవగుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామానికి ఉపయోగ పడే సామాజిక పనులను చేపట్టాలన్నారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మోహన్ మాట్లాడుతూ, ఈ ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ జాబు కార్డు కలిగిన లబ్ధిదారులకు పనులను కల్పించడమే ధ్యేయ మన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

16 నుంచి సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలోని బలిఘట్టం బైపాస్ రోడ్డు వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.సుబ్రమణ్యస్వామి షష్ఠి సందర్భంగా 16న శనివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 17న ఆదివారం సాయంత్రం 6 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం,18న తెల్లవారుజామున అభిషేకాలు, భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ పూజారులు శేఖర్ స్వామి, మణికంఠ స్వామి తెలియజేశారు. మరిన్ని వివరాలు కోసం ఫోన్:9490036207, 9440843532, 9030351845, 8374474 14 కి సంప్రదించాలని కోరారు.

పాడి రైతులకు దాణా పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగుల పరిధి పలు గ్రామాల రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణాను సోమవారం మాడుగుల పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడి పశువుకు అవసరమైన అన్ని పోషకాలు (ప్రోటీన్లు కొవ్వు, కార్బోహైడ్రేట్లు)కలిగిన మిశ్రమం దాణా పశువులకు అవసరమన్నారు. పచ్చగడ్డి కొరతకు ప్రత్యామ్నయంగా రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. మండలంలో అవును వాడ, పొంగలిపాక కేజేపురం, మాడుగుల గ్రామాల్లో పాడి రైతులకు 6.5 టన్నుల దాణా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. సబ్సిడీపై దాణా కావలసిన రైతులు ఆధార్ జిరాక్స్, పశు ఆరోగ్య సంరక్షణ కార్డు తీసుకుని సంబంధిత పశు వైద్యశాలలను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ బి కె చైర్మన్ కుక్కర శ్రీధర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాణా అందజేస్తున్న పశు వైద్య శాల సహాయ సంచాలకులు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ బాధితులకు అందజేశారు. గొలుగొండ మండలం గుండుపాలకు చెందిన మర్రి రామకృష్ణకు లక్షా 15వేలు, ఏఎల్‌పురంకు చెందిన యర్రంశెట్టి చినబుజ్జికు రూ.50వేలు, చింతల మురళి రూ.45వేలు, ఏటిగైరంపేటకు చెందిన గుడివాడ సత్యనారాయణకు రూ.26వేలు, కొత్తమల్లంపేటకు చెందిన సింగంపల్లి సన్యాసమ్మకు రూ.54వేలు మొత్తం ఐదుగురు లబ్ధిదారులకు రూ.2.90లక్షల చెక్కులను అందజేశారు. సిఎం చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గణేష్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, మండల నాయకులు పాల్గొన్నారు.

చెక్కును ఇస్తున్న ఎమ్మెల్యే గణేష్

ఓటింగ్ యంత్రాలపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం నియోజక వర్గంలో మొబైల్ వాహనంపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు సోమవారం ఆర్డీవో హెచ్‌వి.జయరాం అవగాహనా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈవిఎం మిషన్ పని తీరును ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ఓటింగ్ యంత్రాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అన్నాజీరావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ జయరాం

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

-ఎస్ఐ రామారావు - ఆదర్శ కాలేజీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చీడికాడ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రామారావు సూచించారు. మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల కాలేజీలో ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ, విద్యార్థులకు ఎంతో మంచి భవిష్యత్తు ఉందని, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.విద్యార్థులు మంచిని అలవర్చుకొని విద్యలో రాణించి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబు మాట్లాడుతూ, విద్యార్థులందరూ విద్యా దశలో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాల జోలికి పోవద్దని ఆయన తెలిపారు. ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులందరూ విద్యలో రాణించి ఉన్నతమైన భవిష్యత్తుకు మంచి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు

గీతాలు ఆలపిస్తున్న భజన బృందం సభ్యులు

అలరించిన భక్తి గీతాలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక శివాలయములో కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా (అర్థ ఏకాహం) భజన కార్యక్రమం నిర్వహించారు.గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత తోట అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో శ్రీనివాసా భజన భక్త సమాజ సభ్యులు, మహిళా భజన సమాజ సభ్యులు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సోమవారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు 12 గంటల పాటు భజన కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రశేఖర్

17 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-కోటవురట్ల: ఈనెల 17 నుంచి జరగనున్న ఆడదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిపాలనాధికారి చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సచివాలయం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, క్రీడల పట్ల ఉత్సాహంగా ఉన్న వారికి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేపట్టి ప్రోత్సహించాలన్నారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యే విధంగా ప్రోత్సహం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

రహదారి నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల: ఇటీవల కురిసిన వర్షాలతో అణుకు రహదారి పూర్తిగా దెబ్బతిందని, తక్షణమే నిర్మాణం చేపట్టాలని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సిపిఎం నాయకులు గిరిజనులు పరిపాలనాధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా చిద్ర మైపోయిందని కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని నల్లమట్టి పాలెం గ్రామానికి చెందిన నల్ల మట్టి ఈశ్వరరావు (49)రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. నల్లమట్టిపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరరావు స్థానిక హెటిరో కంపెనీలో పని చేస్తున్నాడు.గత నెల 21న కంపెనీలో విధులు ముగించుకొని రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ సమీపంలో ప్రమాదాన్ని గురి కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు విశాఖ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సను అందించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నిండా మునిగిన రైతులు

-పూర్తిగా దెబ్బతిన్న మిరప పంట

నీటితో తడిసి వడలి పోయిన మిరప పంట

ప్రజాశక్తి -కోటవురట్ల: ఇటీవల తుఫాను కారణంగా చౌడువాడ గ్రామంలో అత్యధికంగా సాగు చేసిన మిరప తోట దెబ్బతింది. సుమారుల 100 ఎకరాల్లో మిరప తోట సాగు చేపట్టారు.ఇంతవరకు ఎకరాకు రూ.40,000 వరకు ఖర్చు చేశామని పూర్తిగా తోట నీటిలో మునిగి పోవడంతో మొక్కలు ఎందుకూ పని రాకుండా పోయాయని రైతులు ఆవేదన చేశారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు వచ్చి వెళ్లారని, తమకు ఎటువంటి హామీ ఇవ్వకపోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు తమకు న్యాయం చేయాలని కోరారు.

నీటిలో ఉన్న పంట

వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి

పాడి పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - చీడికాడ: మిచౌంగ్ తుఫాన్‌తో వర్షాల కారణంగా పశువులకు అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని చీడికాడ పశు వైద్యాధికారిని గాయత్రి దేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తుఫాన్ కారణంగా వర్షపు నీరు నిలువ ఉండడంతో పశువులకు అంటు వ్యాధులైన గొంతువాపు, జబ్బ వాపు వ్యాధు లు సోకే అవకాశాలు ఉన్నందున టీకాలు వేయించాలని ఆమె కోరారు. మండలంలో చీడికాడ, పెద్ద గోగాడ, కండివరం, బయలుపూడి, దండి సురవరం, జైతవరం గ్రామాలలో సుమారు 600 పైగా పశువులకు టీకాలు వేయడం జరిగిందని ఆమె తెలిపారు. రైతులు ఎవరైనా టీకాలు వేయించని వారు ఉంటే గ్రామాలలోని సచివాలయంలో పశు సహాయకులు లేదా పశు వైద్యశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

తుప్పలు తొలగింపును పరిశీలిస్తున్న సిఐ

సిఐ, ఎస్ఐల చొరవతో

తుప్పల తొలగింపు

ప్రజాశక్తి -కొత్తకోట: కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్, ఎస్ఐ లక్ష్మణరావు ఆధ్వ ర్యంలో కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధి కొత్తకోట - కన్నంపేట రహదారిలో మలుపుల వద్ద ప్రమాద కరంగా ఉన్న తుప్పలను సోమవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఇటీవల ఈ రహదారిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో స్థానిక పోలీసులు నివారణా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కొత్తకోట నాయుడు చెరువు నుంచి కన్నం పేట కాలనీ వరకూ రహదారి కిరు వైపులా తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ మాట్లాడుతూ, రహదారి భద్రతకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు...

శివాలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక శివాలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కార్తీక మాసం ఆఖరి సోమవారం పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఆలయ అర్చకులు మహేష్ పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ చెరుకూరు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు .

రేబాకలో మహిళల పూజలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రేబాక గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గొట్టుముక్కల శ్రీహరి రాజు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గూడుపమ్మ తల్లి ఆలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారుగా 3,000 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆలయం వద్ద ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్తీకమాసం కావడంతో అత్యధికంగా భక్తులు సుమారు 2000 మంది భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనితి రమణ, ధర్మరాజు, మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

కేంద్ర పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెంలో కేంద్ర పథకాలపై వికసిత భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు కేంద్ర పథకాలు, రాయితీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంకు హాజరైన ఇన్‌చార్జ్ ఎంపిడిఒ సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు రామునాయుడు, కార్యదర్శి రాజారావు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మాకవరపాలెం: స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులు నేరాలకు పాల్పడకుండా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైమ్ స్పాట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరూ దిశ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించే టోల్ ఫ్రీ నెంబర్లు 100, 112ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుందరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

నియామక పత్రం ఇస్తున్న జేపీసీ రాష్ట్ర అధ్యక్షులు

మత్స్యకార జెసి ఇన్‌ఛార్జిగా వెంకటేష్

ప్రజాశక్తి -నక్కపల్లి: మత్స్యకార జేఏసీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జిగా దొండవాక గ్రామానికి చెందిన కోడ వెంకటేష్‌ను నియమించినట్లు మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య, ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు తెలిపారు. సోమవారం వెంకటేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మిడి జిల్లా మత్స్యకార జేఏసీ సంఘ సభ్యులు మైలపల్లి అమ్మోరయ్య, అనకాపల్లి జిల్లా జనరల్ సెక్రటరీ చింతకాయల శ్రీనివాస్, నక్కపల్లి మండల అధ్యక్షులు పిక్కి నూకనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని పెదదొడ్డిగల్లు గ్రామంలో సోమవారం సాయంత్రం ఏపీకు జగన్ సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ పాలన, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. పార్టీ జెండాను ఎగుర వేసి సచివాలయం వద్ద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీ ని

జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల విజయలక్ష్మి కుమారి, మున్నీషా బేబీ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, నాయకులు నాగ అప్పలరాజు ,అల్లు రమణ, లోడగల చంద్రరావు పాల్గొన్నారు.

సమిష్టిగా పోరాడి హక్కులు సాధించుకుందాం

ప్రజాశక్తి -ఆనందపురం : బిసిలంతా ఐకమత్యంతో హక్కులు సాధించుకొని, చట్టసభల్లో ప్రాతినిధ్యం పెంచుకుందామని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం గంభీరం చందన ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బిసిలంతా ఒకేతాటిపై నడవాలని, రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెచ్చి, జనాభా ప్రాతిపదినక బిసిలకు సీట్లు కేటాయింపునకు కృషి చేయడంతోపాటు వారిని గెలిపించడం ద్వారా చట్టసభల్లో బిసిల వాణి వినిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఉత్తరాంధ్రకు వలస నాయకులు వస్తే, వాళ్లను తరిమికొట్టేలా పోరాటం చేయాలనన్నారు. బిసి సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నూతన అధ్యక్షులు కర్రి ధనుంజయనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 90 శాతం బిసిలు ఉన్నారని, దామాషా ప్రకారం సీట్లు కేటాయించేలా రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెద్దామన్నారు. త్వరలో ఉత్తరాంధ్రలో పర్యటించి, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కమిటీలను వేయడం ద్వారా యూనియన్‌ను బలోపేతం చేయడంతోపాటు ఫిబ్రవరి రెండో వారంలో బిసి గర్జనసభకు సమాయత్తం చేద్దామన్నారు.

కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి పల్లి శ్రీనివాస్‌నాయుడు, నగర అధ్యక్షులు పల్లా రమణ, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఇస్తున్న అప్పారావు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -యస్.రాయవరం: మండలంలో లైన్స్ క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గుడివాడ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 21 మందికి విద్యార్థులకు సోమవారం జిల్లా ఉప విధ్యాధికారి పెన్నడ అప్పారావు,అడ్డరోడ్డు శ్రీ ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ నల్లపరాజు సీతారామరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు నాగన్న దొర, స్పందన చేయూత కమిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.

పథకాల బ్రోచర్‌ను ఇస్తున్న నాయకులు

అందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తమల్లంపేట సచివాలయ పరిధిలో సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు ఆధ్వర్యంలో ఏపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి గజ్జలపు మణికుమారి మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మండల నాయకులు కొరుప్రోలు పాణి శాంతారాం, గాదం పాలెం సర్పంచ్ నల్లబెల్లి శ్రీను, సింగంపల్లి నాయుడు, వలంటీర్లు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయితీ ఏఎల్ పురం గ్రామంలో సోమవారం వేకువ జామున తాటాకిళ్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన వైబోయిన సత్తిబాబు కొన్నాళ్లుగా స్థానిక కమ్మరి కాలనీలో తన తాటాకుల ఇంట్లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు.

సోమవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగి తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. ఫ్రిడ్జ్, టీవీ, బీరువాలతో పాటు దుస్తులు, వంట సామాగ్రి కాలి బుడిదయ్యాయి. సుమారు ఒక లక్ష ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు విలేకరులకు తెలిపాడు.

పంటల పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల పంటలను పరిశీలించి నమోదు చేసేందుకు మండలంలో వ్యవసాయ అధికారులు అన్ని గ్రామాలను పరిశీలిస్తున్నట్టు వ్యవసాయ అధికారి సౌజన్య తెలిపారు. సోమవారం ఆమె తెలిపిన వివరాలు ప్రకారం నష్టపోయిన రైతులు పంటలను 18 వ తేది లోపు పరిశీలించి నమోదు చేయడం జరుగుతున్నాందన్నారు. ఈ జాబితాని పంచాయతీ కార్యాలయం, రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆమె తెలిపారు.